ప్రజాశక్తి

శుక్రవారం 10 అక్టోబర్ 2025

I

అల్లూరి సీతారామరాజు



పంచాయతీ భవనం పనులకు శ్రీకారం

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని జర్రాకొండ గ్రామంలో పంచాయితీ భవన నిర్మాణ పనులకు గురువారం శ్రీకారం చుట్టారు. పీఆర్ ఏఈ సంజీవ్‌రావు, మండల పరిషత్ వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు, సర్పంచ్ కొర్ర చిట్టిబాబు కలిసి స్థలాన్ని పరిశీలించి కొలతలు వేశారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు మాట్లాడుతూ, జర్రాకొండ మండలంలోని అత్యంత వెనుకబడిన గ్రామమని, పంచాయితీ భవనం లేక గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. భవనం మంజూరవడం సంతోషకరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్ విజయ్, సెక్రటరీ, పీసా ప్రతినిధి పొట్టి దొర పాల్గొన్నారు.



పనులు ప్రారంభిస్తున్న నాయకులు, సిబ్బంది

విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనలు పెంపొందించాలి

- ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి శ్రీపూజ - చెకుముకి సంబరాల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-పాడేరు: విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచన దృక్పథం పెంపొందించడానికి చెకుముకి సైన్స్ ప్రతిభా పరీక్ష ఉపయోగపడుతుందని పాడేరు ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి శ్రీ పూజ తెలిపారు. జన విజ్ఞాన వేదిక జిల్లా కమిటీ సభ్యులతో కలిసి గురువారం జిల్లా కేంద్రంలో చెకుముకి సంబరాల గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, విద్యార్థులలో సైన్స్ పట్ల అభిరుచిని పెంపొందించడానికి చెకుముకి సైన్స్ సంబరాలు తోడ్పడతాయన్నారు. తాను కూడా పాఠశాల స్థాయిలో ఈ టాలెంట్ టెస్ట్‌లో పాల్గొన్నట్లు ఆమె గుర్తు చేసుకున్నారు. డిప్యూటీ డైరెక్టర్ పరిమళ మాట్లాడుతూ, చెకుముకి వంటి పోటీ పరీక్షల్లో విద్యార్థులను ప్రోత్సహించడం ద్వారా పోటీ తత్వం అలవడుతుందన్నారు. జిల్లా సైన్స్ అధికారి నాగేశ్వరరావు మాట్లాడుతూ, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తప్పనిసరిగా ఈ సంబరాల్లో పాల్గొనేటట్లు చొరవ చూపాలన్నారు. అల్లూరి జిల్లా జనవిజ్ఞాన వేదిక ప్రధాన కార్యదర్శి యండమూరి పారయ్య మాట్లాడుతూ, జిల్లాలోని 8,9,10 తరగతులు చదువుతున్న విద్యార్థులు సైన్స్ సంబరాలు పాల్గొనేందుకు అర్హులన్నారు. ఈ సంబరాలు పాఠశాల స్థాయిలో ఈనెల 18, మండల స్థాయిలో నవంబర్ 1, జిల్లా స్థాయిలో నవంబర్ 23, రాష్ట్రస్థాయిలో డిసెంబర్ 12, 13, 14 తేదీల్లో నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు ఎం.జాన్, సిహెచ్. సరస్వతి, జన విజ్ఞాన వేదిక జిల్లా ముఖ్య సలహాదారులు శేషాద్రి, ప్రధానోపాధ్యాయులు ప్రసాద్, గంగాభవాని, మంజుల, సింహాచలం, జిల్లా కమిటీ సభ్యులు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న పిఒ శ్రీపూజ, జెవివి నేతలు

ఉరుములతో భారీ వర్షం

ప్రజాశక్తి-పెదబయలు : మండల కేంద్రంలో శుక్రవారం మధ్యాహ్నం ఉరుములు మెరుపులతో భారీ వర్షం కురిసింది. ఉరుముల శబ్దాలకు స్థానికులు, వసతగృహాల్లో ఉన్న విద్యార్థులు భయందోళనకు గురయ్యారు. భారీవర్షం కారణంగా విద్యుత్ అంతరాయం ఏర్పడింది. మధ్యాహ్నం అయనప్పటికీ కారుచీకటి కమ్ముకుంది. వర్షపు నీరు ఏరులై ప్రవహించింది. మెయిన్ రోడ్డు బురదమయంగా మారింది.

తుప్పల తొలగింపు

ప్రజాశక్తి -జిమాడుగుల: మండలంలో సొలభం పంచాయితీ రోడ్డుకు ఇరువైపులా ఉన్న తుప్పలను గురువారం స్థానిక సర్పంచ్ . హనుమంతరావు 15వ ఆర్థిక సంఘం నిధుల నుండి తుప్పలను తొలగించినట్లు ఆయన అన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ రహదారి గుండా నిత్యం అధిక సంఖ్యలో ఆటోలు, ద్విచక్ర వాహనాలు జీపులు తిరుగుతున్నాయన్నారు.



తుప్పలు తొలగిస్తున్న గ్రామస్తులు



పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్

రోడ్డు పనులు ప్రారంభం

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మండలంలోని బరడ పంచాయతీ పరిధిలోని బిమిడి గ్రామం నుంచి రోడ్డు పనులను గురువారం స్థానిక సర్పంచ్ పార్వతి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పార్వతి మాట్లాడుతూ, ట్రైబల్ వెల్ఫేర్ శాఖ నుండి కనెక్టివిటీ మట్టి రోడ్డునీ సుమారు మూడు కిలోమీటర్లు నిర్మించేందుకు నిధులు మంజూరు కావడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నామన్నారు. రోడ్డు నిర్మాణంతో రెండు పంచాయితీల గ్రామ ప్రజలు రాకపోకలకు సౌకర్యవంతంగా ఉంటుందని తెలిపారు.

రోడ్డు నిర్మాణానికి కొలతలు

-ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి అనంతగిరి: మారుమూల గిరిజన గ్రామాల గర్భిణీలకు తప్పని డోలి కష్టాలు గురువారం ప్రజాశక్తి దినపత్రికలో వెలువడైన వార్త కథనానికి స్పందించిన జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కొత్తూరు పంచాయతీ టెంకబుడ్డి గ్రామానికి రోడ్డు నిర్మాణం కోసం కొలతలు వేయడం జరిగిందని ట్రైబల్ వెల్ఫేర్ జెఇ. గణేష్ తెలపారు. కనీస రోడ్డు సౌకర్యం లేక టెంకబుడ్డి గ్రామం నుండి దిగువలో ఉన్న కష్ణ పురం మెయిన్ రోడ్డు వరకు మూడు కిలోమీటర్లు, బూసిపాడు నుండి టెంకబుడ్డి వరకు సుమారు 8 కిలోమీటర్లు గుర్తించి కొలత తీయడం జరిగిందని తెలిపారు.

ధాన్యం సేకరణకు ఏర్పాట్లు చేయాలి

- జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్

ప్రజాశక్తి-పాడేరు: జిల్లాలో రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ప్రణాళిక బద్ధంగా ధాన్యం సేకరణకు అన్ని ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్ ఎం.జె.అభిషేక్ గౌడ్ అధికారులను ఆదేశించారు. గురువారం మధ్యాహ్నం జిల్లా కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో ధాన్యం సేకరణ పై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించి సమీక్షించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ,గత సంవత్సరంలో ఎదురైన అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ఈసారి ఖరీఫ్ కాలంలో చాలా జాగ్రత్తలు పాటించి రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ధాన్యం సేకరించాలని సూచించారు.వ్యవసాయ అధికారులు కొనుగోలు కేంద్రాలు తనిఖీ చేసి అన్ని సక్రమంగా ఉన్నాయా లేదా అన్న నివేదిక అందజేయాలన్నారు. గత సంవత్సరం అనుభవాల దృష్ట్యా ఏమన్నా సమస్యలు ఉంటే తెయజేయాలన్నారు. మార్కెట్ కమిటీ అధికారులు అన్ని ఆర్బికేలు, నిల్వ గోదాములు తనిఖీ చేసి ఖాళీ స్థలాలు వాటి వివరాలు నివేదికలు అందజేయాలన్నారు. తూనికలు, కొలతల అధికారులు ఆర్బికేలలో ఉన్నటువంటి తూనికల పరికరాల పనితీరుని పరిశిలించాలన్నారు. తేమ కొలిచే యంత్రాలు పరిశీలించి కావలసిన చర్యలు చేపట్టాలన్నారు. నిల్వలను మిల్లులకు తరలించేందుకు సకాలంలో వాహనాలను సమకూర్చాలని ఎక్కడ ఎటువంటి సమస్యలు లేకుండా వాహనాలు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో ధాన్యం వర్షాలకు తడవకుండా ఉండేందుకు ప్రతి ఎంఎస్పి సెంటర్లలో వందకు పైగా టార్పాలియన్స్ రైతులకు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. రాగి కొనుగోలు కేంద్రాలను పరిశీలించి ఎంత కొనుగోలుకు వస్తుందో తెలియజేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి యస్ బి యస్ నంద్, జిల్లా పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ వి మోహన్ బాబు, రవాణాశాఖాధికారి ప్రకాష్‌రావు, జిల్లా సహకారశాఖాధికారి రామకృష్ణం రాజు పాల్గొన్నారు.

పలు చోట్ల గ్రామసభలు

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మండలంలో మాకవరం పంచాయతీ కుంబిరిపడ, కుతుడ గ్రామాలలో ఆది కర్మ యోగి గ్రామసభను పంచాయతీ కార్యదర్శి వి చిన్నన్న ఆధ్వర్యంలో పంచాయతీ సర్పంచ్ వంతాల గంగాధర్, టిడిపి యూనిట్ ఇంచార్జ్ చెండా బాబుజి సమక్షము నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ గంగాధర్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో ఒక ప్రజా ఉద్యమంలో కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన ఆదికర్మ యోగి పథకం గిరిజనుల అభివృద్ధికి ఎంతో దోహద పడుతుందన్నారు. ఏనుగురాయి పంచాయతీ చోటాముఖిపుట్టు, పరతాపుట్టు గ్రామాలలో ఆది కర్మయోగి అభియాన్ కార్యక్రమాలు స్థానిక' సర్పంచ్ ఎస్ నరసింగరావు అధ్యక్షతన, సెక్రటరీ ఆధ్వర్యంలో నిర్వహించారు. మండల అధ్యక్షుడు శ్రావణ్ కుమార్,తెదేపా తెలుగు యువత అధ్యక్షుడు ఏం చిన్ని బాబు పాల్గొన్నారు .

స్థానిక సర్పంచ్ మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజన గ్రామాలకు అభివద్ధికి ప్రత్యేక దష్టి తీసుకుంటుందని తెలిపారు. ఏనుగురాయి పంచాయతీలో 7 రెవిన్యూ గ్రామాలుగా గుర్తించి ఆ గ్రామాలలో రోడ్డు ,మంచినీటి ,డ్రైనేజీ ,అంగన్వాడి బిల్డింగ్, స్కూల్ బిల్డింగ్ సమస్యలపై ప్రత్యేక దష్టి సరించాలనీ ప్రభుత్వాన్ని కోరారు . ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ కే బలరం, బూత్ ఇన్చార్జి కే హరిదాస్, గ్రామస్తులు, సచివాలయ సిబ్బంది ప్రజలు హాజరయ్యారు.



అవగాహన కల్పిస్తున్న సర్పంచ్, నాయకులు



ఆందోళన చేపడుతున్న గ్రామస్తులు

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలి

- గ్రామస్తుల ఆందోళన

ప్రజాశక్తి-అనంతగిరి: మండలంలోని టోకూరు పంచాయతీ పరిధి పింపోలుగుడా గ్రామంలో తాగునీటి పథకానికి ఏర్పాటు చేసిఉన్న ట్రాన్స్ఫారం మరమ్మతు గురైందని తక్షణమే కొత్త ట్రాన్స్ఫారం ఏర్పాటు చేయాలని గ్రామస్తులు గురువారం గ్రామంలో ఉన్న తాగునీటి పంపు హౌస్ వద్ద వర్షానికి గొడుగులతో చేతన పట్టుకొని నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మధు. నందిని. భవాని .కుమారి లు మాట్లాడుతూ, ట్రాన్స్ఫారం మరమ్మతుకు గురికావడంతో గ్రామానికి తాగునీటి సరఫరా నిలిచిపోయిందని తక్షణమే కొత్త ట్రాన్స్ఫారం ఏర్పాటు చేసి తాగునీటి సరఫరా అందించాలని వారు డిమాండ్ చేశారు పలుమార్లు విద్యుత్ శాఖ అధికారులకు ట్రాన్స్ఫారం ఏర్పాటు చేయాలని విన్నవించినా పట్టించుకోనే నాదుడే లేరని తెలిపారు.

పాడేరు బస్సుకు తృటిలో తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి-చింతపల్లి : చింతపల్లి నుంచి పాడేరు వైపు వెళ్తున్న ఏపీఎస్ఆర్టీసీ బస్సుకు గురువారం మధ్యాహ్నం లోతుగెడ్డ జంక్షన్ సమీపంలోని ప్రమాదం తృటిలో తప్పింది. లోతుగెడ్డ జంక్షన్ ఖాసిం పాత చికెన్ షాపు వద్దకు వచ్చేసరికి బస్సుకు బ్రేకులు ఫెయిలై అదుపు తప్పి రహదారి పక్కన రాళ్లతో నిర్మించిన రక్షణ గోడను ఢీకొట్టింది. అకస్మాత్తుగా బ్రేకులు ఫెయిల్ కావడంతో డ్రైవర్ చాకచక్యంగా బస్సును రహదారి పక్కకు మళ్లించడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఆ సమయంలో బస్సులో సుమారు 25 మంది ప్రయాణికులు ఉన్నారు. ఘటనతో క్షణం పాటు ప్రయాణికులలో భయాందోళన నెలకొంది. వెంటనే డ్రైవర్ బస్సును ఆపేసి అందరినీ కిందకు దించాడు. స్థానికులు వెంటనే అక్కడికి చేరుకుని సహాయం చేశారు. అందరూ సురక్షితంగా బయటపడ్డారు. ప్రమాదంపై పాడేరు డిపో అధికారులు విచారణ ప్రారంభించారు. బస్సును రోడ్డు మీద నుంచి తొలగించి రవాణా సజావుగా కొనసాగిస్తున్నారు. డ్రైవర్ ధైర్యసాహసం వల్ల పెద్ద ప్రాణనష్టం తప్పిందని అధికారులు తెలిపారు.



దూసుకెళ్లిన బస్

మహిళా చట్టాలను పటిష్టంగా అమలు చేయాలి

- ముంపు మండలాల ప్రజలకు పరిహారం, పునరావాసం కల్పించాలి
- ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రమణి



ఐద్వా జెండా ఆవిష్కరిస్తున్న సీనియర్ నాయకురాలు ముర్రం రంగమ్మ



మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రమణి

ప్రజాశక్తి -చింతూరు: దేశంలో మహిళలకు రోజురోజుకీ రక్షణ కరువైందని, మహిళా రక్షణ చట్టాలను ప్రభుత్వాలు పటిష్టంగా అమలు చేయాలని, ముంపు మండలాల్లో ప్రజలకు పరిహారం, పునరావాసం నాణ్యమైన రీతిలో అందజేయాలని ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రమణి డిమాండ్ చేశారు. గురువారం ఎర్రంపేటలో జరిగిన ఐద్వా ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా రెండో మహాసభలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తొలుత సంఘం జెండాను సీనియర్ నాయకురాలు ముర్రం రంగమ్మ ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో రమణి మాట్లాడుతూ రోజురోజుకీ అదాని, అంబానీ ఆస్తులు మాత్రం పెరిగిపోతున్నాయని, దేశంలో మహిళలకు రక్షణ మాత్రం కొరవడుతోందన్నారు. దేశంలో హింసాయుత కార్యక్రమాలు, వరకట్న వేధింపులు మహిళల ఆరోగ్యంపై ప్రభుత్వం నిర్లక్ష్యం, పౌష్టికాహార విషయంలో నిరాసక్తతతో ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. మహిళలకు ప్రవేశపెట్టిన చట్టాలను చిత్తశుద్ధితో అమలు చేయాలని, ఉద్యోగ ఉపాధి రంగాల్లో రిజర్వేషన్ కల్పించాలని ఈ సందర్భంగా ఆమె డిమాండ్ చేశారు. ఈ సభలో డ్వాక్రా సమస్యలు, పోలవరం సమస్యలపై తీర్మానం చేశారు. అనంతపురంలో ఈ నెల 13 14 15వ తేదీల్లో రాష్ట్ర మహాసభలు నిర్వహించడం జరుగుతుందని, ఉద్యమాలకు దిశా నిర్దేశం ఆ సభలో నిర్ణయించబడతాయన్నారు. ఈ సభలో మరియం థావలె, తదితరులు పాల్గొంటారని తెలిపారు. అనంతరం15 మందితో ఐద్వా జిల్లా నూతన కమిటీ ఎన్నికైంది. జిల్లా అధ్యక్షులుగా మడివి శ్రీదేవి, కార్యదర్శిగా ఐ.పద్మావతి ఎన్నికయ్యారు. సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్, సిఐటియు ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్, మండల కార్యదర్శి పోడియం లక్ష్మణ్, విఆర్‌పురం ఎంపిపి కారం లక్ష్మీ, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.



జిల్లా అధ్యక్షులు మడివి శ్రీదేవి, కార్యదర్శి ఐ.పద్మావతి

సచివాలయం, అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

ప్రజాశక్తి - రంపచోడవరం : వివిధ ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో రిజిస్టర్లు పక్కాగా నిర్వహించాలని రంపచోడవరం ఐటిడిఎ పిఒ స్మరణ్‌రాజ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం రంపచోడవరం మండలం ముసలిమిల్లిలోని సచివాలయం, అంగన్‌వాడ కేంద్రం, సబ్‌సెంటర్‌ను ముందుగా ప్రాజెక్ట్ అధికారి ఆకస్మికంగా పరిశీలించారు. సచివాలయంలోని ఈ పంచాయతీ పరిధిలో ప్రజలకు వివిధ రకాలైన సేవలు సకాలంలో అందించాలని ఆదేశించారు. చిన్న బారంగి అంగన్‌వాడి కేంద్రం పరిశీలించి పిల్లలకు ఆటపాటలతో విద్య బోధించాల న్నారు. సబ్ సెంటర్‌ను పరిశీలించి వివిధ రకాలైన మందులు ఎప్పటికప్పుడు అందుబాటులో పెట్టాలని ఎప్పటికప్పుడు ఈ పంచాయతీ పరిధిలో గ్రామాలు పర్యటించాలన్నారు. అనంతరం రంపచోడవరంలో జిసిసి గోదామును పరిశీలించారు. రికార్డులు పక్కాగా నిర్వహించాలన్నారు. అంబేద్కర్ సెంటర్‌కు దగ్గర్లో ఉన్న మండల పరిషత్ పాఠశాలను పరిశీలించారు. అనంతరం పందిరి మామిడిసెంటర్ సమీపంలోని జీడిపిక్కల ప్రాసెసింగ్ యూనిట్ పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఆయన వెంట అడిషనల్ డిఎంహెచ్ఒ డాక్టర్ డేవిడ్, సిడిపిఒ ఉమ, వెలుగు, జిసిసి అధికారులు పాల్గొన్నారు.



సచివాలయంలో రికార్డులు తనిఖీ చేస్తున్న ఐటిడిఎ పిఒ



రైతులతో మాట్లాడుతున్న ఎఒ చక్రధర్

చీడపీడలపై రైతులకు సూచనలు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: మండలంలోని బడదనంపల్లి పంచాయితీ చిన్న రేలంగిపాడు గ్రామాల్లో గురువారం వ్యవసాయ అధికారులు పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా పొలాలను ఎఒ చక్రధర్, సిబ్బంది పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. మిత్ర పురుగులు, శత్రుపురుగులు గురించి రైతులకు వివరించారు. ప్రస్తుతం వరిలో మాగుడుపాము పొడతెగులు, దోమ ఉన్నట్లు గుర్తించామన్నారు. పొడ తెగులు నివారించడానికి ముందుగా గట్ల మీద ఉన్న గడ్డిని తీసేయాలని, నివారణకు హెక్సాకోనజోల్ 2ఎంఎల్ లేదా వాలిడామైసిన్ 2 ఎమ్ఎల్, అజోక్సిస్ట్రోబిన్18.2శాతంతో కలిపి డైఫెనోకోన జోల్ 11.శాతం ఏదో ఒక మందును ఎకరాకి 200 లీటర్లు నీటిలో కలిపి పిచికారి చేయాలని అలాగే దోమ నివారించడానికి పైమెట్రోజెన్ 0.6 గ్రాములు ఇమిడా క్లోప్రిడ్,1.6 మి.లీ లేదా డైనోట్ఫ్యూరాన్,0.4 గ్రాములు పై వాటిలో ఏదో ఒక మందును 200ఎంఎల్ వేపనునెతో కలిపి ఎకరానికి 200లీటర్లు నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పీసా కమిటీ కార్యదర్శి కినపర్తి రాజుబాబు, కమిటీ సభ్యులు నీలాద్రి యేసు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆదివాసీ నిరుద్యోగ సంఘు నాయకుడు ముత్యాలరెడ్డి

13న చలో ఐటిడిఎను జయప్రదం చేయండి

ప్రజాశక్తి- విఆర్‌పురం: ఆదివాసీ హక్కుల కోసం ఈ నెల 13వ తేదీన చింతూరులో జరిగే మహాధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మండలంలో అడవివెంకన్నగూడెం, పెద్దమంటపల్లి, చిన్నమట్టపల్లి , రాయిగూడెం ఆదివాసీ నిరుద్యోగ సంఘం నాయకులు అధ్యక్షతన గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసీ నిరుద్యోగ నాయకులు ముత్యాలరెడ్డి మాట్లాడుతూ ఆదివాసీ హక్కుల సాధనకు పలు డిమాండ్లతో ఈనెల 13న చింతూరు ఐటిడిఎ ముందు మహాధర్నా నిర్వహిస్తున్నామని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అడవి వెంకన్నగూడెం, రాయిగూడెం గ్రామ పెద్దలు కారం సుందరయ్య, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: ఏజెన్సీలో గిరిజనుల హక్కులసాధనకై ఈ నెల 13న రంపచోడవరం ఐటిడిఎ వద్ద తలపెట్టిన ఛలో ఐటిడిఎ కార్యక్రమాన్ని గిరిజన యువత విజయవంతం చేయాలని ఆదివాసీ హక్కులు ఉద్యోగాల సాధన కమిటీ డివిజన్ ప్రధాన కార్యదర్శి గుమ్మడిలోవ ప్రసాద్ గురువారం పిలుపునిచ్చారు. మండలంలోని కిర్రాబు, నెల్లిమెట్ల, కొత్తకింద్ర, వనకరాయి, లాగరాయి తదితర గ్రామాల్లో సమావేశాలు నిర్వహించారు. సాధన కమిటీ డివిజన్ నాయకులు దట్టెం శ్రీను, విజయ్,లోవ రాజు సన్నీ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి చెత్తసేకరణపై అవగాహన

ప్రజాశక్తి-రంపచోడవరం : మండలంలోని తాటివాడ పంచాయతీలో జిల్లా పంచాయతీ అధికారి చంద్రశేఖర్ ఇంటింటి చెత్త సేకరణ కార్యక్రమంపై గ్రామంలో చెత్త సేకరణ ఐవిఆర్ఎస్ కాల్స్ పై అవగాహన కల్పిస్తూ ఇంటింటికి పర్యవేక్షించారు. తడి పొడి చెత్తపై గ్రామప్రజలకు అవగాహన కల్పించారు. పంచాయితీ ఆస్తుల సంరక్షణ, మంచినీటి సరఫరా, పారిశుధ్యంపై బందపల్లి,తాటివాడ సర్పంచ్‌లతో మాట్లాడారు. స్వర్ణ పంచాయితీ పోర్టల్ ద్వారా ఇంటి పన్ను వసూలు తదితర అంశాలపై చర్చించారు. డిఎల్‌పిఒ సిబ్బంది, డిప్యూటీ ఎంపిడిఒ, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, బందపల్లి, బొలగొండ సచివాలయం పరిధిలోని సిబ్బంది, పారా మెడికల్ సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.



చెత్త సేకరణలో పాల్గొన్న జిల్లా పంచాయతీ అధికారి చంద్రశేఖర్

సర్పంచ్ చెక్‌పవర్ రద్దు చేయండి

అంబేద్కర్ యువజన సంఘం డిమాండ్

ప్రజాశక్తి-కూనవరం: కూనవరం పంచాయతీలో అవినీతి జరిగిందని, అధికారులు తేల్చి చెప్పారు. సమాధానం చెప్పాలని కూనవరం పంచా యతీ మాజీ సురేష్ సర్పంచ్ మల్లంపల్లి నాగ సత్య హేమంత్ గాంధీలకు, అధికారులు నోటీసు ఇవ్వడం జరిగిందని, పత్రికా విలేకరుల సమావేశంలో కొక్కెరపాటి రవీంద్ర తెలియజేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవినీతిపై సమాధానం చెప్పాలని నోటీసులు ఇవ్వడమే కాకుండా కూనవరం పంచాయతీ సర్పంచ్ చెక్ పవర్ తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేసారు. అవినీతి జరిగిందని తేలినా చర్యలు తీసుకోవడానికి ఎంత సమయం కావాలని ఈ సందర్భంగా అధికారులను డిమాండ్ చేశారు. కొద్ది రోజుల క్రితం ఐటిడిఎ పిఒకి అంబేద్కర్ యువజన సంఘం తరపున తాను ఫిర్యాదు చేసిన మేరకు అవినీతిపై దర్యాప్తు మరింత వేగం అయిందన్నారు. దర్యాప్తు జరిపించి పై అధికారులకు రికార్డు అందిస్తామని పిఒ తెలిపారని గుర్తు చేశారు. ఇంకా ఎంత సమయం కావాలని ప్రశ్నించారు. అవినీతి బయటపడి రికవరీ చెల్లించేవరకూ అంబేద్కర్ యువజన సంఘం పోరాటం కొనసాగుతుందని ఆయన తెలిపారు. అంబేద్కర్ యువజన సంఘం నాయకులు కొత్తపల్లి రవి సూరం రాములు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్లు మంజూరు చేయాలి


వేడుకుంటున్న వృద్ధురాలు

ప్రజాశక్తి-పెదబయలు : దిక్కులేని బాధితులకు పింఛన్లు మంజూరు చేయాలని మూల నివాసి సంఘ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కర్ర వై కుమార్ డిమాండ్ చేశారు. మండలంలోని లింగేటి పంచాయతీ చిలకలమామిడి గ్రామానికి చెందిన నిరుపేద తిడిరో రాజమ్మకు 60 ఏళ్లు పైబడి వయస్సు ఉన్నా పింఛను మంజూరు చేయలేదని పేర్కొన్నారు. చెప్పులు అరిగేలా ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సచివాలయ సిబ్బంది రాజమ్మకు పింఛను మంజూరుకు చర్యలు తీసుకోవాలని, లేకుంటే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని హెచ్చరించారు.

'శ్రీకృష్ణార్జున యుద్ధం' ప్రదర్శన

ప్రజాశక్తి- మాధవధార : విశాఖపట్నం పోర్టు ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా విశాఖపట్నం పోర్టు అథారిటీ, హార్బర్ అండ్ పోర్ట్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్తంగా శ్రీకృష్ణార్జునయుద్ధం అనే పద్య నాటకాన్ని శ్రీ సీతారామ కల్యాణ మండపంలో ప్రదర్శించారు. హార్బర్ అండ్ పోర్ట్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు చౌదరి అప్పారావు అధ్యక్షతన జరిగిన ప్రదర్శనను ముఖ్య అతిథులుగా రిటైర్డ్ ట్రాఫిక్ మేనేజర్ కె.సత్యనారాయణరావు, గంట అప్పలనాయుడు, రిటైర్డ్ ఫోర్మెన్ నూనెల అప్పారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రముఖ కళాకారులు పివిఎన్.సత్యనారాయణమూర్తిని ఘనంగా సత్కరించారు. పోర్టు ఉద్యోగులు, డిఎల్‌బి ఉద్యోగులు, కళాకారులు, కళాభిమానులు పాల్గొని నాటకాన్ని తిలకించారు. ఈ కార్యక్రమంలో అన్నెపు నారాయణరావు, పులి శివప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

రేకులషెడ్‌పై ఒరిగిన భారీ టేకు చెట్టు

ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికుల్లో భయాందోళన


ఒరిగిన చెట్టు

ప్రజాశక్తి-చింతపల్లి : ప్రభుత్వ కార్యాలయాల ఎదుటే రేకుల షెడ్లు, ఇంటిపైనా టేకు చెట్టు ఒరిగి ప్రమాదకర పరిస్థితి నెలకొన్నా విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకోకపోవడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చింతపల్లి ప్రధాన రోడ్డుకు ఆనుకుని ఉన్న మండల పరిషత్, తహశీల్దార్ కార్యాలయాల ఎదురుగా మెకానిక్ పంచదారల రాజుకు చెందిన రేకుల షెడ్‌పైనా, ఇందుగ అచ్యుత్ రామయ్య నివాసంపైనా ఈ ఏడాది ఆగస్టు 18న భారీ టేకు చెట్టు ఒరిగిపోయింది. అప్పటి నుండి ఆ చెట్టును తొలగించలేదు. ఒరిగిన ఆ చెట్టు ఎప్పుడైనా కూలిపోయి పెద్ద ప్రమాదం జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ శాఖ పరిధిలోకి వచ్చే ఈ చెట్టును తొలగించాలంటూ పలుమార్లు అధికారులు, సిబ్బందికి ఫిర్యాదులు చేసినా ఎటువంటి చర్యలు తీసుకోలేదు. చెట్టు తమ షెడ్‌పై పడిపోవడంతో వర్క్‌షాప్ పనులు పూర్తిగా నిలిచిపోయాయని, ఇంటి గోడలు పగులు ఇచ్చాయని, వర్షం వస్తే కరెంట్ షార్ట్ సర్క్యూట్ జరిగే ప్రమాదం ఉందని పంచదారల రాజు, అచ్యుత్ రామయ్య ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ చెట్టు తొలగించాలని అటవీ శాఖ అధికారులను సంప్రదించగా విద్యుత్ శాఖ పరిధిలో ఉన్న చెట్టు కాబట్టి, వారు అధికారికంగా విజ్ఞప్తి చేస్తేనే తాము తొలగిస్తామని అటవీశాఖ అధికారులు చెబుతున్నారని, విద్యుత్ శాఖ అధికారులు తమ బాధ్యతను అటవీ శాఖ సిబ్బందిపై నెట్టివేస్తున్నారని బాధితులు మండిపడ్డారు. స్థానికులు మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాల ఎదుటే ఇలాంటి ప్రమాదకర పరిస్థితి ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెట్టు ఎప్పుడు పూర్తిగా కూలిపోతుందో తెలియదని, ప్రాణనష్టం జరిగితేనే స్పందిస్తారా? అని ప్రశ్నిస్తున్నారు. అధికారులు తక్షణమే చెట్టును తొలగించి, ప్రమాదం సంభవించకముందే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నేరాలు ఘోరాలు


పట్టుబడిన నిందితులతో పోలీసులు

28 కిలోల లిక్విడ్ గంజాయి పట్టివేత

ప్రజాశక్తి - పెదబయలు : పెదబయలు మండలం, సీతగుంట గ్రామానికి సమీపంలోని ఒడిస్సా బ్రిడ్జి దగ్గరలో మెయిన్ రోడ్డు పై పెదబయలు పోలీసులు వాహన తనిఖీలు చేస్తుండగా 28.710 కేజీల గంజాయి పట్టుబడింది. చింత గురువు, రాయమామిడి జంక్షన్, గోమంగి, లక్ష్మీపేట, కొత్తపుట్, పెదబయలు, మీదుగా ఒడిశా కొరాపుట్ వైపుగా నడుచుకుంటూ వెళ్తున్న ముగ్గురు వ్యక్తులను ఆపి తనిఖీ చేయగా రెండు బ్యాగ్‌లో 28.710 కేజీల లిక్విడ్ గంజాయి పట్టుబడింది. వాళ్ళ వద్ద పట్టుబడిన గంజాయిని, రెండు ఆండ్రాయిడ్ ఫోన్లును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ కొల్లి రమణ తెలిపారు. పట్టుబడిన లిక్విడ్ గంజాయి విలువ సుమారు రూ.14,35,500 ఉంటుంది. పట్టుబడిన నిందితులపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. నిందితులకు కోర్టు రిమాండ్ విధించడంతో వారిని విశాఖపట్నం సెంట్రల్ జైలుకు తరలించినట్లు చెప్పారు.

నేటి నుంచి బోధనేతర పనులు బహిష్కరిస్తాం


దుంబ్రిగుడలో వినతి పత్రాన్ని ఇస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి దుంబ్రిగుడ:-ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమైక్య పిలుపుమేరకు ఈనెల 10 వ తేదీ నుండి బోధనేతర పనులు, విద్యా శక్తి కార్యక్రమంను బహిష్కరిస్తామని స్థానిక మండల విద్యాశాఖ అధికారి ఎస్.సుందర్రావుకు ఫ్యాప్టో సంఘాల నాయకులు గురువారం మండల కేంద్రంలో మెమోరాండంను అందజేశారు. విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన పథకము, పరీక్ష పత్రాల మూల్యాంకనం తప్ప బోధనేతర పనులు ఇంకేమి చేయబోమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల యూత్ అధ్యక్షుడు ఎస్ బాలకృష్ణ, ప్రధాన కార్యదర్శి కే రాజారావు, ఏపీటీఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శ్రీరామ్, కె.బొబ్బిలి, డిటిఎఫ్ నాయకులు కే.జలంధర్, మల్లేశ్వరరావు, వికాస్, వివిధ సంఘాల జిల్లా నాయకులు ఎస్ కన్నయ్య, కే రఘునాథ్, వి రామారావు, బాలన్న, టి సుబ్బారావు, మేఘనాథ్, సత్యనారాయణ పాల్గొన్నారు.

అనంతగిరి:రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన పోరుబాట అనే కార్యక్రమాన్ని, బోధనేతర పనులను బహిష్కరించాలని ఫ్యాప్టో యూనియన్ పిలుపు మేరకు ఈనెల 10వ తేదీ నుండి బహిష్కరిస్తామని మండల విద్యాశాఖ అధికారి నాగేశ్వరావు కు కలిసి లిఖిత పూర్వకంగా ఉపాధ్యాయ సంఘాల నేతలు విన్నవించారు. ఉపాధ్యాయులకు కొత్త కొత్త యాప్ లు తెచ్చి పని భారం పెట్టడంతో విద్యార్థులకు సరైన విద్యను అందించలేక పోతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పి.దేవుడు, రాంబాబు, సన్యాసిరావు, ఈశ్వరరావు, మంజునాథ్ పాల్గొన్నారు.

వి.ఆర్.పురం: బోధనేతర కార్యక్రమాలను ఉపాధ్యాయులు బహిష్కరించాలని యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు పిలుపు నిచ్చారు. మండలంలోని రేఖపల్లి ఎంఇఒ కార్యాలయంలో యుటిఎఫ్ నాయకులు నాగేశ్వరరావు, జగదీష్ ఎంఇఒ లక్ష్మీనారాయణకి గురువారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మితిమీరిన బోధనేతర కార్యక్రమాల వలన బోధనా సమయం హరించుకుపోతోందన్నారు.

గంగవరం: ఫ్యాప్టో రాష్ట్ర కమిటీ నిర్ణయం మేరకు అక్టోబర్ 10 నుండి ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల హాజరు, మధ్యాహ్నభోజన పథకానికి సంబంధించిన పనులు మాత్రమే ఉపాధ్యాయులు చేపడతారని మండల యూటిఎఫ్ అధ్యక్షులు సిహెచ్.రాంబాబుదొర తెలిపారు.

ఫ్యాప్టో ఆధ్వర్యాన వినతులు

ఏజెన్సీ జిల్లా విద్యాశాఖాధికారి వై.మల్లేశ్వరరావు కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ గంగవరం మండల ప్రధాన కార్యదర్శి సిహెచ్ వెంకటేశ్వరరావు, గౌరవ అధ్యక్షులు రఘుబాబుదొర, మహిళా అధ్యక్షురాలు రుక్మిణిదేవి పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: పాఠశాలల్లో బోధనేతర పనులపై ఎంఇఒ-2 టి.సూరయ్య రెడ్డికి మండల యూటిఎఫ్ ఆధ్వర్యంలో రాజవొమ్మంగి మండల ఉపాధ్యాయులు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల సహాధ్యక్షులు శ్రీను, మహిళా సహాధ్యక్షురాలు కోడూరు లోవరాజు , ప్రధాన కార్యదర్శి కానెం శ్రీను పాల్గొన్నారు.


వినతి పత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నేతలు

అదనపు ప్రభుత్వ ప్లీడర్‌గా వరప్రసాదరావు

ప్రజాశక్తి-లీగల్ : విశాఖపట్నంలోని జిల్లా కోర్టులు, సీనియర్ సివిల్ జడ్జి కోర్టులలో ప్రభుత్వం తరపున కేసులు వాదించుటకు అదనపు ప్రభుత్వ న్యాయవాదిగా నగరానికి చెందిన సీనియర్ అడ్వకేట్ డివిఎస్‌కె.వరప్రసాదరావును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. గురువారం జిల్లా కోర్టులోని తనకు కేటాయించిన కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. మూడేళ్లపాటు ఈ బాధ్యతల్లో ఉంటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం తరపున సివిల్ కేసులలో అత్యంత పారదర్శకంగా త్వరగా తీర్పులు వచ్చేటట్లు చేస్తానని చెప్పారు. వరప్రసాద్ నియామకం పట్ల జిల్లా న్యాయవాదుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎంకె.శ్రీనివాస్, ఎల్.పార్వతీనాయుడు, సీనియర్ న్యాయవాదులు బగాది తులసీదాస్, హరిహర రెడ్డి తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

వైభవంగా స్వర్ణ పుష్పార్చన

ప్రజాశక్తి-వేపగుంట : సింహాచల పుణ్య క్షేత్రములో దేవస్థాన పండితుల వేదమంత్రాల, నాదస్వర మంగళ వాయిద్యాలతో శాస్త్రోక్తంగా స్వర్ణ పుష్పార్చన వైభవంగా నిర్వహించారు. అర్చకులు వేకువ జామున స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ప్రాత్ణకాల పూజలు సాంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ గోవిందరాజు స్వామి వారిని సర్వాంగ సుందరంగా అలంకరించి ఆలయ కల్యాణ మండపములో వేదికపై అధిష్టింపజేశారు.

అప్పన్నను దర్శించుకున్న జస్టిస్ పివి.రెడ్డి

ప్రజాశక్తి-వేపగుంట : శ్రీవరహాలక్ష్మీనృసింహస్వామిని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ పివి.రెడ్డి గురువారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ సహాయ కార్య నిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరరావు స్వాగతం పలికారు. జస్టిస్ పివి.రెడ్డి కప్పస్తంభాన్ని అలింగనం చేసుకున్న అనంతరం స్వామిని దర్శించుకున్నారు.

చెవుడుపై అవగాహన

ప్రజాశక్తి-సీతమ్మధార : ఇంటర్నేషనల్ వీక్ ఆఫ్ డెఫ్ పీపుల్ సందర్భంగా చెవుడుపై అవగాహన ప్రచార కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్య కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేశారు. జిల్లా ఎన్‌సిడి ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ హారిక అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా సలహాదారు వి.లక్ష్మి ప్రత్యేకంగా శిక్షణ అందించారు.

ఇకెవైసికి నేటితో గడువు ముగింపు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న వేతనదారులు నేటిలోగా ఇకెవైసి చేయించుకోకపోతే పనిలోకి వెళ్లే అవకాశం కోల్పోతారని స్థానిక ఉపాధి హామీ ఎపిఒ శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇకెవైసి చేయించుకోవాలని ఇప్పటికే పలు పర్యాయాలు సూచించామని ఇంకా అనేకమంది చేయించుకోవాల్సి ఉందని ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

విద్యుత్ బిల్లులు అందక వినియోగదారుల ఆందోళన

ప్రజాశక్తి -సీలేరు: జీకేవీధి మండలం సీలేరులో విద్యుత్ వినియోగదారులు ట్రాన్స్కో సిబ్బంది మీటర్ రీడింగ్ ఇంకా తీయకపో వడంతో ఆందోళన చెందుతున్నారు. గత నెల నుంచి ఇప్పటివరకూ రీడింగ్ తీయకపోవడంతో బిల్లు బకాయిలు పెరిగిపోతున్నాయని అదనంగా పెనాల్టీ కూడా చెల్లించాల్సి వస్తుందని వాపోతున్నారు. సీలేరు పంచాయతీ పరిధిలో సుమారు 2000 విద్యుత్ మీటర్లు ఉన్నాయి. ఇప్పటికైనా ట్రాన్స్‌కో అధికారులు స్పందించి సకాలంలో విద్యుత్తు బిల్లులు వినియోగదారులకు అందజేయాలని కోరుతున్నారు.

దెబ్బగూడెంలో తాగునీటికి కటకట

ప్రజాశక్తి -వెూతుగూడెం: చింతూరు మండలం గూడూరు పంచాయతీ దబ్బగూడెంలో తాగునీటికి పలువురు అవస్థలు పడుతున్నారు. రోడ్డు పక్కన ఉన్న బోరు వారం రోజుల నుంచి పనిచేయడం లేదు. దీంతో కిలోమీటర్ దూరంలో ఉన్న బోరు నుంచి నీరు తెచ్చుకోవాల్సి వస్తోందని, మరికొన్ని చోట్ల బోరు ఉన్నా వాటి నుంచి నీరు రావడం లేదని అధికారులు స్పందించి బోరు బాగు చేయాలని కోరుతున్నారు.


పనిచేయని బోరు


మాట్లాడుతున్న మండల టిడిపి అధ్యక్షుడు పల్లాల వెంకటరెడ్డి

టిడిపి నాయకులపై దుష్ప్రచారం మానుకోండి

ప్రజాశక్తి -గంగవరం: వైసిపి నాయకులు టిడిపి నాయకులపై చేస్తున్న దుష్ప్రచారాన్ని ఇప్పటికైనా మానుకోవాలని గంగవరం మండల టిడిపి అధ్యక్షులు పల్లాల వెంకటరెడ్డి అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ టిడిపి చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసి ఓర్వలేక వైసిపి నాయకులు ఇష్టం వచ్చినట్టు ప్రవర్తిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర రైతు అధికార ప్రతినిధి కనిగిరి రాంబాబు మాట్లాడుతూ ఇదే రీతిలో వైసిపి నాయకులు ప్రవర్తిస్తే 11 నుండి 4 కి వస్తారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ పాము అర్జున్, బిజెపి మండల అధ్యక్షులు నీలాలమ్మ, జనసేన అధ్యక్షులు సిద్దు, మండల క్లస్టర్ ఇంచార్జ్ , సత్యనారాయణ అమ్మ, పావని, సత్యవేణి పాల్గొన్నారు.

న్యాయవాదుల శిక్షణకు దరఖాస్తులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ అధ్యక్షులు,జిల్లా ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టిరాజు సూచనల మేరకు 40 గంటల మధ్యవర్తిత్వ శిక్షణ కార్యక్రమం కొరకు అర్హులైన సీనియర్ న్యాయవాదులు, న్యాయవాదులు,విషయ నిపుణుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు, జిల్లా న్యాయ సేవధికార సంస్థ కార్యదర్శి ఆర్. సన్యాసినాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు విశాఖపట్నం జిల్లాలో సంబంధిత న్యాయవాదుల సంఘం అభ్యర్థుల నుండి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, విశాఖపట్నంకు దరఖాస్తులు పంపాలని ప్రకటనలో తెలిపారు.

జిఎస్‌టిపై అవగాహనా ర్యాలీ


కొయ్యూరు : పిహెచ్‌సి సిబ్బందితో ఎంపిడిఒ బాలమురళీకృష్ణ


విఆర్‌పురం: రేఖపల్లి ఆసుపత్రిలో నిర్వహించిన సమావేశం

ప్రజాశక్తి-విఆర్‌పురం: మండలంలోని రేఖపల్లి ఆసుపత్రిలో వైద్యాధికారి (ఆయుష్) డాక్టర్ స్వర్ణలత ఆధ్వర్యంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఎంపిడిఒ ఇమాన్యుయెల్ మాట్లాడుతూ సూపర్ జిఎస్‌టి, ప్రతిపేద, మధ్యతరగతి కుటుంబం లబ్దిపొందే విధంగా మార్పు చెందిందన్నారు. మందుల ధరలు కూడా తగ్గాయన్నారు. అనంతరం రేఖపల్లి ఆస్పత్రి నుండి జంక్షన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, మాజీ జెడ్పిటిసి ముత్యాల రామారావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

జికె వీధి : మండలంలోని రింతాడ సచివాలయ సిబ్బంది ప్రజలకు సూపర్ జిఎస్‌టిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. నిత్యావసర సరుకులు, గృహని ర్మాణ ముడిసరుకులు ధరలు తగ్గాయన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

సీలేరు: జికె వీధి మండలం సీలేరు ప్రభుత్వ ఆసుపత్రిలో జిఎస్‌టిపై అవగాహన సదస్సు నిర్వహించారు. వైద్యాధికారి ఖాదర్ మస్తాన్‌వల్లి హోమియో వైద్యాధికారి సృజనారాయ్ హాజరయ్యారు. గతంలో ఉన్న జిఎస్‌టికి ప్రస్తుతం ప్రభుత్వం తగ్గించిన జిఎస్టికి వ్యత్యాసాన్ని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్, ఎంపిటిసి పిల్ల సాంబమూర్తి వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొయ్యూరు : మండలంలో జిఎస్టి అవగాహన సదస్సులో భాగంగా కొమ్మిక, కంటారం పంచాయతీలో గ్రామసభలు నిర్వహించి కంటారం పిహెచ్‌సిని సందర్శించి సిబ్బంది గ్రామప్రజలతో ఎంపిడిఒ బాలమురళీ కృష్ణ సమావేశమయ్యారు. జిఎస్‌టిపై అవగాహన కల్పించారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు, ఎఎన్‌ఎంలు పాల్గొన్నారు.

చింతూరు: చింతూరులోని కమ్యూనిటీ హెల్త్‌సెంటర్ వైద్య అధికారులు, సిబ్బంది, ఆశా కార్యకర్తలు అవగాహన ర్యాలీ నిర్వహించారు. సమావేశంలో మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.వి.కోటిరెడ్డి మాట్లాడుతూ వైద్య వస్తువులు సేవల ధరలలో అవగాహన కల్పించడానికి ప్రచారం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. డాక్టర్ రమణరావు గైనిక్, డాక్టర్ మహేష్, ఎస్‌ఎన్‌సియు మెడికల్ ఆఫీసర్, హెడ్ నర్స్ కుమారి, సిబ్బంది ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు పోటీలు

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వాణిజ్యశాస్త్ర విభాగం అర్థశాస్త్ర విభాగ ఆధ్వర్యంలో జిఎస్‌టి సంస్కరణలపై వక్తృత్వ పోస్టర్ పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రత్నమాణిక్యం అధ్యక్షత వహించిన కార్యక్రమంలో అర్థశాస్త్ర విభాగాధిపతి వెంకటరావు, వాణిజ్య శాస్త్ర విభాగాధిపతి హారతి, డాక్టర్ వై. పద్మ తదితరులు పాల్గొన్నారు.

జిసిసి డిపో ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి -సీలేరు: జికె వీధి మండలం ధారకొండ పంచాయతీ గంగవరం జిసిసి డిపోను జికె వీధి తహశీల్దార్ అన్నాజీరావు గురు వారం ఆకస్మిత తనిఖీ నిర్వహించారు. స్టాక్ రిజిస్టర్ పరిశీలించారు. ఎటువంటి అవతవకలకు పాల్పడకుండా విధి నిర్వహణ చేపట్టాల న్నారు. ప్రభుత్వం నిర్దేశించిన నిర్ణీత వ్యవధిలో ఉచిత రేషన్ సరుకులు అందజేయాలన్నారు. అక్రమ తూనికలకు పాల్పడుతున్నట్టు ఫిర్యాదు వస్తే సహించేది లేదని హెచ్చరించారు. అనంతరం డిపోలో ఉన్న స్టాక్ ను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


స్టాక్ రిజిస్టర్ పరిశీలిస్తున్న తహశీల్దార్ అన్నాజీరావు

అధ్వాన రహదారులతో అవస్థలు

ప్రజాశక్తి -సీలేరు: గత ఏడాది సెప్టెంబర్ 8న కురిసిన భారీ వర్షాలు, వరదలకు రోడ్లు వంతెనలు అధ్వానంగా తయారై రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. జికె వీధి మండలం ధారకొండ నుంచి గుమ్మిరేవులు వెళ్లేందుకు రహాదారి సౌకర్యం లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఈ రహదారి గత ఏడాది వరదలకు కొట్టుకుపోగా తాత్కాలిక మరమ్మత్తులు నిర్వహించి డైవర్షన్ రోడ్డు ఏర్పాటు చేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఆ మట్టి రహదారి బురదమయంగా మారింది. అంతర్రాష్ట్ర రహదారి ఒరిస్సాని కలుపుకొని వెళ్లే పిల్లిగెడ్డ వంతెన నూతనంగా నిర్మించి తాత్కాలికంగా మట్టితో డైవర్షన్ రహదారిని ఏర్పాటు చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు వాహనాలు కూరుకుపోయే పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి రహదారులు, వంతెనలు శాశ్వత మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.


పిల్లిగెడ్డ వంతెన వద్ద కొట్టుకుపోతున్న మట్టి


మాట్లాడుతున్న ఎంపిపి కృష్ణారెడ్డి

ప్రభుత్వ ఉద్యోగులు సమన్వయంతో పని చేయాలి

- ఎంపిపి కృష్ణారెడ్డి

ప్రజాశక్తి - గంగవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి పల్లాల కృష్ణారెడ్డి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించారు. ఎంపిపి కృష్ణారెడ్డి మాట్లాడుతూ పంచాయతీల అభివృద్ధికి పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు మండల స్థాయి ఉద్యోగులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. మండల పరిషత్ ఉపాధ్యక్షులు వైస్ ఎంపిపిలు రామతులసి, గంగాదేవి, కాప్షన్ సభ్యులు ప్రభాకర్, మొల్లేరు సొసైటీ చైర్‌పర్సన్ పాముఅర్జున్ తదితరులు సమావేశంలో మాట్లాడారు. మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యులు ప్రభాకర్‌రావు మాట్లాడుతూ గత సమావేశాల్లో చేసిన తీర్మానాలు పరిష్కరించిన అంశాలను సమావేశంలో వెల్లడించాలని కోరారు. గత తీర్మానాలు గురించి ప్రశ్నించగా కొద్దిసేపు ఎంపిడిఒ లక్ష్మణరావు ప్రభాకర్ మధ్య వాగ్వాదం జరిగింది. కొత్తాడ సర్పంచ్ కామరాజుదొర చాలామంది సమావేశాలకు గైర్హాజరు అయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో వివిధ శాఖల్లో అమలు చేస్తున్న కార్యక్రమాలను ఎంపిపి సమీక్షించారు. మల్లేరు సొసైటీ చైర్ పర్సన్ ఫాము అర్జున , ఎంపిటిసి పద్మావతి పలువురు అధికారులు పాల్గొన్నారు.

ప్రాజెక్టుల భూసేకరణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : జిల్లా పరిధిలో చేపట్టనున్న విశాఖ మెట్రో రైలు ప్రాజెక్టు, రైల్వేలైన్ల విస్తరణ, ఇతర పనులకు సంబంధించి భూసేకరణ ప్రక్రియ, ఇతర పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ భవనంలో జరిగిన సమీక్షా సమావేశంలో మెట్రో రైల్, సాధారణ రైల్వే లైన్ విస్తరణ, ఇతర అవసరాలకు కోసం చేపట్టాల్సిన భూసేకరణ సంబంధిత పనులు, ఇతర అంశాలపై ప్రస్తుత పరిస్థితిని అధికారులు అడిగి తెలుసుకుని సూచనలు చేశారు. అభివృద్ధి పనులకు సంబంధించిన అన్ని రకాల పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయి పర్యటనలు చేసి చర్యలు చేపట్టాలన్నారు. కోర్టు పరిధిలో ఉన్న అంశాల పరిష్కారంలో అధికారులు తీరుపై అసహనం వ్యక్తం చేస్తూ ప్రత్యేకశ్రద్ధ తీసుకొని పరిష్కారానికి కృషి చేయాలని సంబంధిత అధికారులు ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె.మయూర్‌అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి భవానీ శంకర్, విశాఖపట్టణం, భీమిలి ఆర్‌డిఒలు పి.శ్రీలేఖ, సంగీత్ మాధుర్, ప్రత్యేక ఉప కలెక్టర్ సుధాసాగర్, మెట్రో ప్రాజెక్టు అధికారులు, జివిఎంసి, విఎంఆర్డిఎ, ఎపిఇపిడిసిఎల్, పలువురు తహశీల్దార్లు పాల్గొన్నారు.

మత్స్యకారులకు వర్క్‌షాప్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సిఎంఎఫ్ఆర్ఐ, విశాఖపట్నం ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి సాంప్రదాయ మత్స్యకారులతో సంప్రదింపుల వర్క్‌షాప్ గురువారం ఫిషింగ్ హార్బర్‌లో నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ ఎం.ఎన్‌హరేందిరప్రసాద్ మాట్లాడుతూ, సంప్రదాయ మత్స్యకారుల అవసరాలు, వేట విధానం, మత్స్యసంపద నాణ్యత, మార్కెటింగ్, సుస్థిరవేట విధానాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు.

ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు వినియోగించుకోవాలని,అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని సీఫుడ్, కేజ్ పెంపక విధానాల ద్వారా ఉపాధి అవకాశాలు పెంచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్రంలోని తీర జిల్లాల నుంచి మత్స్యకారులు, డాక్టర్ జోకిజకుడన్, డాక్టర్ మధుసూదనరావు, డాక్టర్ మీనానిఫ్ఫాట్ (సిఎంఎఫ్ఆర్ఐ ప్రధాన శాస్త్రవేత్తలు) జెడి ఫిషరీష్, పి.లక్ష్మణరావు మహంతి అర్జిల్లి దాస్, హనుమంతరావు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.